క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సురేష్



టేకుమట్ల: మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనిత సెలవులపై వెళ్లడంతో ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్న గౌడ సురేష్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు మండల పరిషత్ అధికారులు, మండల నాయకులు అభినందనలు తెలిపారు.

ఎరువుల గోదాం తనిఖీ



గోదాంను తనిఖీ చేస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని ఎరువుల గోదాంను ఎస్సై అశోక్, మండల వ్యవసాయ అధికారి సురేందర్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. గోదాంలోని ఎరువుల నిల్వలకు సంబంధించిన వివరాలు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డు, ధరల పట్టికలు పరిశీలించారు. సీఈఓ సాగర్ తదితరులు ఉన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

కాటారం: మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన పంతకాని తిరుమల సమ్మయ్యను శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండం వసంతరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు జావీద్‌ఖాన్ సన్మానించారు. రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు సూచించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- మాజీ కో ఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్

చిట్యాల: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని మాజీ కో ఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకారం అందించి ఆమోదించాలని అన్నారు. రాష్ట్రంలో 14 ముస్లీం కులాలకు చెందిన 37 లక్షల మంది ఉన్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి సొంత రాష్ట్రంలో గుజరాత్‌లో బీసీ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. అలాగే మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, రాష్ట్రాలలో బీసీ ముస్లింలకు రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా అక్కడి ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ బిల్లును రాష్ట్రంలో ఉన్న బీజేపీ నాయకులు అమలుకాకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

ముమ్మరంగా వరినాట్లు



పొలంలో గొర్రు కొడుతున్న రైతు



నాటు వేస్తున్న మహిళా కూలీలు

- కురుస్తున్న వర్షాలతో ఊపందుకున్న సాగు
- వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీబిజీ

టేకుమట్ల: వర్షాకాలం ప్రారంభం నుంచి సరైన వర్షాలు లేక పంటలను పండించడం ఎలా అనే ఆందోళన చెందిన రైతులకు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఊరట లభించింది. మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని అన్ని చెరువుల్లోకి నీరు చేరి వానాకాలం పంటలకు భరోసా కల్పించింది. చలివాగు, మానేరు ప్రవహిస్తుండడంతో జలకళ సంతరించుకుంది. దీంతో మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో రైతులు వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. వెలిశాల చెరువు మత్తడి పోయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ పనులు చేస్తున్నారు. వానాకాలంలో మండలంలోని సుమారు 7300 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాలతో రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటూ బిజీబిజీగా గడుపుతున్నారు. వర్షాలు లేక ఇప్పటికే నాట్లు ఆలస్యం కావడంతో ప్రస్తుతం రైతులు పనులను ముమ్మరం చేశారు. రానున్న రెండు వారాల్లో మండలంలో పూర్తి స్థాయిలో వరి నాట్లు సాగు అయ్యే అవకాశం ఉంది.



నారు పంచుతున్న రైతు

వెదజల్లే పద్ధతితో మేలు



రైతులకు వెదజల్లే పద్ధతితో ఎంతో మేలు కలుగుతుంది. ఖర్చు ఆదా అవడంతోపాటు దిగుబడి కూడా ఎక్కువగా వస్తుంది. ఆలస్యమైందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేసుకుంటే అధిక ఆదాయాన్ని పొందవచ్చు.

- కల్యాణి, ఏఓ టేకుమట్ల

గంజాయి సరఫరా చేస్తున్న యువకుల అరెస్ట్

- ఆరున్నర కిలోల సరుకు స్వాధీనం

కాటారం(మహాముత్తారం): ఒడిశా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శనివారం మహాముత్తారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహాముత్తారం మండలం స్తంభంపల్లి(పిపి)కి చెందిన లోక హరిప్రసాద్, జనగాం అంజికుమార్ జల్సాల కోసం డబ్బు ఎలాగైనా సంపాదించాలని అనుకున్నారు. ఒడిశాకు వెళ్లి అక్కడ మారుమూల గ్రామాల్లో గంజాయి కొనుగోలు చేసి తెలంగాణలోని కరీంనగర్, హనుమకొండ వంటి ప్రాంతాల్లోని యువకులకు అధిక ధరలకు విక్రయించడానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. తెలిసిన సమాచారంతో మండలంలోని దొబ్బలపాడు సమీపంలోని అలుగువాగు బ్రిడ్జి వద్ద ఎస్సై మహేందర్‌కుమార్, పోలీస్ సిబ్బంది వారిని పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద ఆరున్నర కిలోల గంజాయి లభించింది. అదుపులోకి తీసుకొని విచారించగా ఒడిశా నుంచి తీసుకువస్తున్నట్లు యువకులు అంగీకరించారు. ఆరున్నర కిలోల గంజాయితో పాటు బైక్ సీజ్ చేశారు. గంజాయి విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని ఎస్సై మహేందర్‌కుమార్ పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



గంజాయితో పట్టుబడిన యువకులు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి ఆశీష్

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఆశీష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తిప్పాపురం, ఆలుబాక, చొక్కాల, మరికాల, వెంకటాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు పవన్, డీపీఎంఓ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని కొడిశాల వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని బయ్యక్కపేటను ఆయన సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాల పరిశీలించారు. ఎన్ఎస్ఐ పాజిటీవ్ కేసుల వివరాల గురించి ఆశావర్కర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని నార్లాపూర్‌లో ఆర్ఎంపీ వైద్యుడి క్లినిక్, డయాగ్నస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ కేసులు వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని ఆర్ఎంపీ వైద్యుడికి సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సీతారాంనాయక్ ఉన్నారు.



వెంకటాపురం(కె): పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండల కేంద్రంలోని ఐటీఐ, నూతనంగా ప్రవేశ పెట్టిన ఏటీసీ కోర్సుల్లో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్‌లో ఎలక్ట్రీషియన్ విభాగంలో 13 సీట్లు, ఫిట్టర్ విభాగంలో 11 సీట్లు, ఏటీసీలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ (ఏడాది కోర్సు) 40 సీట్లు, ఇండస్ట్రియల్ రోబొటిక్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నిషియన్(ఏడాది కోర్సు) 40 సీట్లు, ఆర్టీసీఎస్ యూజింగ్ అడ్వాన్స్ టూల్(ఏడాది కోర్సు) 20 సీట్లు, బేసిక్ డిజైనర్ అండ్ వర్చ్యువల్ వెరిఫియర్ మెకానికల్ (2సంవత్సరాలు) 24 సీట్లు, అడ్వాన్స్‌డ్ సీఎంసీ మిస్సింగ్ టెక్నీషియన్ (2 సంవత్సరాలు) 24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్(2 సంవత్సరాలు) 24 సీ ట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 31లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎడతెరిపి లేని వాన

కాటారం: కాటారం, మహాముత్తారం మండలాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గ్రామాల్లోని పలు రోడ్లు బురదమయమయ్యాయి. పత్తి చేలలో నీరు నిలిచిపోయింది. వర్షం రాత్రి వరకు ఇలానే కురిస్తే కాటారం, మహాముత్తారం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న కల్వర్టులపై నుంచి వరద నీరు వెళ్లే అవకాశం ఉంది. కాగా వర్షంతో వరి సాగు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. గ్రామాల్లో వరినాట్లు ఉపందుకున్నాయి.

కమిటీ ఎన్నిక



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం ఆజాంనగర్‌లో బీజేపీ బూత్ కమిటీలను ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పులిగుజ్జు రాజు శనివారం తెలిపారు. 66వ బూత్ అధ్యక్షుడిగా నల్ల సుఖేందర్ రెడ్డి, 67వ బూత్ అధ్యక్షుడిగా పొట్ట బాతుల పోశయ్య, 68వ బూతు అధ్యక్షుడిగా కొక్కుల రాజును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామోదర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రవీందర్, సమ్మిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాటారం: కాటారం మండలం విలాసాగర్ మానేరు నుంచి మహాముత్తారం మండల కేంద్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం మండల కేంద్రానికి సమీపంలోని చింతకాని క్రాస్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మహాముత్తారం మండలం మాదారం గ్రామానికి చెందిన దిలీప్, కాటారం మండలం మద్దులపల్లికి చెందిన శ్రీధర్ అనే ఇద్దరు డ్రైవర్లు మండల కేంద్రం మీదుగా ఇసుక ట్రాక్టర్లు తీసుకొని మహాముత్తారం వైపుగా వెళ్తున్నారు. గమనించిన ఎస్సై, సిబ్బంది చింతకాని క్రాస్ వద్ద ట్రాక్టర్లను ఆపి విచారించగా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అధికారుల సూచనలు పాటించాలి

- జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

భూపాలపల్లి రూరల్: జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్నందున రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఎంఏఓ సతీశ్‌తో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో యూరియా కొరత లేదన్నారు. జంగేడు పీఏసీఎస్‌లో 1489 యూరియా బస్తాలు స్టాకు ఉందని, రైతులు గమనించాలని తెలిపారు. పత్తి చేనులో నీరు నిలిచి ఉన్నట్లయితే నీటిని తక్షణమే తీసివేయాలని సూచించారు.



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న బాబురావు

సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

రేగొండ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. శనివారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, రేగొండ మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ములుకల్ల తిరుపతి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను, డీఏలను వెంటనే విడుదల చేయలన్నారు. అలాగే కేజీబీవీ ఉద్యోగులకు సమ్మె కాలానికి వేతనం చెల్లించాలన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ జీతాలు పెంచాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సంఘంలో చేరాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి వెంకటరమణారెడ్డి, మండల ప్రధా న కార్యదర్శి భాస్కరరావు, జిల్లా నాయకులు విజ య్‌కుమార్, నవీన్, దిలీప్, విద్యాసాగర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి

భూపాలపల్లి రూరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందిచుకోవాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటికొండ రవి కిరణ్ అన్నారు. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ సైనికులకు, సైనిక విధులలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు సన్మానం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలిఫ్, నాయకులు వంశీ, కిరణ్, మునేందర్, సుధాకర్, రాజశేఖర్, రాకేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.



రిటైర్డ్ జవాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- వనవాసీ కల్యాణ పరిషత్ జిల్లా కార్యదర్శి సంతోశ్

ఎస్ఎస్‌తాడ్వాయి: గిరిజన ఇల వేల్పుల జాతర ఆలయాల అభివృద్ధి ప్రభుత్వం నిధులు కేటాయించాలని వనవాసీ కల్యాణ పరిషత్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మైపతి సంతోశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లే జిల్లాలోని కోయ వేల్పుల జాతరల అభివృద్ధికి కేటాయించాలన్నారు. నాయకపోడు లక్ష్మీదేవర ఆలయాల నిర్మాణాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రతి గిరిజన గూడెంలోని గుళ్లను మేడారం జాతర సమానంగా అభివృద్ధి చేయాలన్నారు. గిరిజన సంస్కృతి పరిరక్షణ కోసం అందరం కలిసి పనిచేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సభ్యులు ఈర్ప స్వామి, జగదీశ్, రాజు, సలెందర్ సాంబయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మైపతి సంతోశ్

ప్రకృతి వ్యవసాయ పంటల సాగు మేలు


- మండల వ్యవసాయ అధికారి కుమార్ యాదవ్

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రకృతి వ్యవసాయ పంటల సాగు లాభాదయకంగా ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి కుమార్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వెలుగు రేఖ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రకృతి సాగుతో భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. క్రిమిసంహారక మందుల వాడాకాన్ని తగ్గించి ముందుతరాల వారికి మంచి భవిష్యత్‌ను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తి రామస్వామి, వెలుగు రేఖ ఎన్‌జీఓ సీఈఓ రజిత, ట్రైనర్ సాంబయ్య, ఏఈఓ దుర్గ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

జాలువారుతున్న జలపాతం

భారీ వర్షాల కారణంగా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులోని పాండవుల గుట్టలలోని జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో గుట్టలపై నుంచి వరద నీరు కిందికి జాలువారుతోంది. ఒక జలపాతం కొండ దిగువ భాగంలో ఉండగా, మరో జలపాతం గుట్టపై ఉంది. పచ్చని ప్రకృతి అందాల నడుమ జాలువారుతున్న జలపాతాలను చూడటానికి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు.

– రేగొండ



పాండవుల గుట్టలోని జలపాతం →

వానొస్తే నరకమే..



గోవిందరావుపేటలో వాగును తలపిస్తున్న గ్రంథాలయం పక్కన ఉన్న రోడ్డు

- సైడ్ కాల్వలు లేక రోడ్లపైనే నీళ్లు
- ఒక వైపు వర్షం.. మరో వైపు బురద
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గోవిందరావుపేట: వానొస్తే మండలంలోని పలు గ్రామాల్లోని అంతర్గతరోడ్లు చెరువులుగా మారుతున్నాయి. వర్షం వచ్చిన ప్రతిసారి ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు వాన, మరో వైపు రోడ్లపై నిలిచిన వర్షపు నీరు, బురదతో నడిచే పరిస్థితి లేకుండా పోతుంది. బురదరోడ్డులో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదానికి గురవుతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా మండల కేంద్రం, పస్రాలోని కాలనీవాసులు రోడ్డెక్కాలంటేనే వణికిపోతున్నారు. బురదలో రాకపోకలు సాగిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. అలాగే చెత్తాచెదారం పేరుకుపోయి అంతర్గతరోడ్లు బురదమయం కావడంతో ప్రజలు అనారోగ్యాకి గురయ్యే ప్రమాదం ఉంది. ప్రతీ సంవత్సరం వర్షకాల సీజన్‌లో దోమలు వృద్ధి చెంది ప్రజలు విషజ్వరాల భారిన పడుతున్నారు. గ్రామాల్లో సైడ్ కాల్వలు లేకపోవడంతోనే నీరు నిలుస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు సీసీ రోడ్డులు నిర్మించాలని కోరుతున్నారు.



పస్రాలోని అభ్యుదయ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు



పస్రాలోని 11వ వార్డులో..

చెరువును తలపిస్తోంది



చిన్న వర్షం పడితే చాలు 4వ వార్డులోని మా కాలనీ చెరువును తలపిస్తోంది. పక్కన ఉన్న వాగులోని నీరు కూడా మా కాలనీలోని రోడ్ల మీదికి, ఇళ్లల్లోకి వస్తుంది. ప్రతీ సంవత్సరం వర్షకాలంలో ఇబ్బంది పడుతున్నాం

- పర్రెం రఘు, గోవిందరావుపేట

సీసీ రోడ్డు వేయాలి



వర్షం పడిన ప్రతిసారి పస్రా గ్రామంలోని అభ్యుదయ కాలనీలో రోడ్లు అన్ని బురదమయంగా మారుతాయి. ఆ రోడ్ల మీద నుంచి నడవాలి అంటే భయం వేస్తుంది. అధికారులు స్పందించి కాలనీలో సీసీ రోడ్లు వేయాలి

-జిట్టబోయిన రమేశ్, పస్రా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అందుకు తండాలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అందుకు తండా గ్రామానికి చెందిన సంఘ దేవేందర్ (25)కు నాలుగు నెలల క్రితం బూజునూరు గ్రామానికి చెందిన కోమలతో వివాహం జరిగింది. మొదటి రెండు నెలలు బాగానే కలిసి ఉన్నారని తర్వాత నుంచి కోమల వేరే కాపురం పెడదామని భర్త దేవేందర్‌తో గొడవ పడుతుండేది. ఈ నెల 24న దేవేందర్ వద్దకు అత్త లింగాల రాజమ్మ, వదిన ఇద్దరు వచ్చి అతడితో గొడవ పడ్డారు. దీంతో మనస్థాపం చెందిన దేవేందర్ పురుగుల మందు తాగాడు. పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి అన్న సంఘ అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291